# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 140 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

02-04-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం

- మగ్గం, పవర్‌లూమ్ నేతన్నలకు యూనిట్ల మేర ఉచిత విద్యుత్
- పింఛన్ పంపిణీలో మంత్రి అచ్చెన్నాయుడు వివరాలు



**నవతరం -కోటబొమ్మాళి**

కోటబొమ్మాళిలో బుధవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు ఉపశమనం కల్పించేందుకు మగ్గం నేతన్నలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పింఛన్లు పారదర్శకంగా పంపిణీ అవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తున్నామని, కోటబొమ్మాళి ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

# అమరావతి బిల్లుతో భవిష్యత్‌పై నమ్మకం

- లోక్‌సభ ఆమోదంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం
- రాజధానికి చట్టబద్ధత
- అభివృద్ధికి బలమైన అడుగు




**నవతరం- శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందడం ఆనందకరమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. రాజధాని విషయంలో నెలకొన్న సందిగ్ధతకు ఈ బిల్లు తెరదించిందని, రాష్ట్ర భవిష్యత్‌కు బలమైన దిశను చూపుతుందని పేర్కొన్నారు. రాజధాని కోసం పోరాటం చేసిన ప్రతి ఒక్కరి కృషికి ఇది ఫలితమని, ఈ విజయాన్ని వారికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌ల సహకారాన్ని ఆయన ప్రశంసించారు. అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా వేగంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# పోక్సో కేసులో సంచలనం నిందితుడు అరెస్ట్

- విశాఖలో జరిగిన ఘటన... హిరమండలం పోలీసుల వేగవంతమైన దర్యాప్తు
- మరణానికి గల కారణాలపై అనుమానాలు
- కేసులో కొత్త కోణాలు వెలుగులోకి

**నవతరం హిరమండలం**

హిరమండలం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. విశాఖపట్నం నగరంలోని సుజాతనగర్ ప్రాంతంలో మార్చి 23 నుండి 24 మధ్య జరిగిన అనుమానాస్పద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన సమాచారం వెలుగులోకి రావడంతో మార్చి 28న కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు.



దర్యాప్తులో భాగంగా నిందితుడిగా గుర్తించిన వ్యక్తిని మార్చి 31న హిరమండలం పరిధిలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు విజియానగరం జిల్లా ఎస్.కోటకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఈ కేసులో మరణానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనకు దారితీసిన పరిస్థితులు, నిందితుడి పాత్రపై పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయడంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతున్నామని వెల్లడించారు.

# రాజాంలో సర్పంచ్‌లకు ఘన సన్మానం

- ఐదేళ్ల సేవలకు వైసీపీ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం
- నిధుల లేమితో గ్రామాల్లో ఇబ్బందులు: నేతల విమర్శలు




**నవతరం -రాజాం**

విజయనగరం జిల్లా రాజాం పట్టణంలోని శ్రీ వెంకట సూర్య దుర్గా కళ్యాణ మండపంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న రాజాం నియోజకవర్గంలోని నాలుగు మండలాల సర్పంచ్‌లను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బాబు తదితరులు హాజరై సర్పంచ్‌ల సేవలను ప్రశంసించారు. వైఎస్ జగన్ మార్గదర్శకత్వంలో గ్రామస్థాయిలో సేవలు అందించినందుకు గర్వంగా ఉందన్నారు. అయితే గత రెండేళ్లుగా ప్రభుత్వ సహకారం లేక సర్పంచ్‌లు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడం వల్ల అభివృద్ధి దెబ్బతిన్నదని విమర్శించారు. అధికారంలో లేకపోయినా ప్రజల్లోనే ఉండి సేవలు కొనసాగించాలని, భవిష్యత్తులో పార్టీని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాత్రికేయుల రక్షణకు సమగ్ర చట్టం అవసరం



- గోవా వేదికగా ఐఎఫ్‌డబ్ల్యూజే కీలక తీర్మానం
- పెరుగుతున్న బెదిరింపులపై తీవ్ర ఆందోళన
- మీడియా స్వేచ్ఛ, భద్రతకు ప్రభుత్వ జోక్యం కోరుతూ డిమాండ్
- ఎన్. ఈశ్వరరావు ఏపీ స్టేట్ ఇంచార్జ్, జాతీయ కార్యవర్గ ఆహ్వానితులు

2లో

# కొరపాం పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- మధ్యాహ్న భోజన పథకం అమలుపై పరిశీలన
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కూన రవికుమార్

2లో



# కోలగట్ల కుటుంబానికి ధర్మాన పరామర్శ

- మాజీ డిప్యూటీ స్పీకర్ నివాసంలో నివాళులు
- మృతిపై ప్రగాఢ సంతాపం వ్యక్తం

**నవతరం -విజయనగరం**

విజయనగరంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సోదరుడు, వైఎస్ఆర్‌సీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కోలగట్ల వెంకట నాగ తమన్న శెట్టి ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.



# డివిజన్‌లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

- ఒకటో తేదీనే పింఛన్లు అందజేస్తున్నాం
- సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: సూరిబాబు

**(నవతరం శ్రీకాకుళం)**

నగరంలోని 31వ డివిజన్‌లో బుధవారం సచివాలయ ఉద్యోగులతో కలిసి స్థానిక డివిజన్ ఇన్‌చార్జ్, ఏపీ కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ విభూది సూరిబాబు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాల అమలులో కట్టుబడి ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు. ఒకటో తేదీ సెలవు రోజు అయితే ముందురోజే పింఛన్లు అందజేస్తున్నామని చెప్పారు. డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకర్ విశేషంగా కృషి చేస్తున్నారని, దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎడిటోరియల్

# ఆనతినీయవా! ప్రభూ!

"నేను ఖమ్మం భారతమ్మ గారి దుకాణంలో నెలవారి సరుకులు కొనుక్కుంటాను. దయచేసి అనుమతి ఇవ్వగలరు. భవదియుడు-సీతారాం". ఇది నిన్న ఫేస్‌బుక్‌లో కవి మిత్రుడు పెట్టిన సాదాసీదా పోస్టు. దీనికి లైక్‌కొడుతూ "నేను కరుణ మెడికల్స్‌లో మందులు ఈ వారానికి కొనుక్కోవాలి. అనుమతించండి" అని కామెంట్ పెట్టాను.కొందరికి ఈ పోస్టు అంతరార్థం అర్థం కాలేదు.కొందరు ఇట్టే పసికట్టేసారు. 146కోట్ల ప్రజల ఆత్మగౌరవంపై ఎక్కుపెట్టిన అస్త్రం అది. ఒక దేశం పరువుకు సంబంధించిన సమస్య. ఇంతకన్న వ్యంగ్యంగా కవి ఏం వివరించగలడు! ఎంత బాధను అవేదనను కడుపులో దాచుకుంటే ఆ మాటలు పెల్లుబుకాయి.

ఇంతకన్న దీనంగా ఏం దేబు రించగలడు! జరుగుతున్న సంఘటనలు, పరిణామాలు, ఎవరినీ కదిలించడం లేదేమీ! మనుషులు, దేశ ప్రజలు, బుద్ధిజీవులు ప్రతిస్పందించడం మానుకున్నారా? నాకెందుకులే అని ఊరుకుంటున్నారా! ఇంతకన్న దారిద్ర్యం ఏముంది! సిగ్గుపడేలా చేస్తున్న ఈ దిగజారుడుతనం తలవంపులు కలిగించడం లేదూ! తూటాలకు కూడా వెరవకుండా వందేమాతరం అంటూ మూడు రంగుల జెండాను పైకెగరేస్తూనే ప్రాణాలు వొదిలిన త్యాగధనుల నేల వారసత్వమేనా ఇంత దిగజారింది! స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వీరులగన్న గడ్డ, ఆ పౌరుషత్వాన్ని ఎందుకు, ఎలా కోల్పోయింది. మాట్లాడితే యాభై ఆరించుల ఛాతీగల ధైర్యంగా చెప్పుకున్న వాళు,, గొంతులోంచి చిన్నమాటను ఉపయోగించడం లేదెందుకు! వాడు పబ్లిక్‌గానే రష్యాదగ్గర, ఇరాన్ దగ్గర చమురు కొనవద్దన్నప్పుడూ ఒక్కమాట పెగల్లేదు.

దానికి బదులుగా నా దగ్గరే కొనాలని హకుం జారీచేసినా, తల ఊపాం తప్ప, ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు యుద్ధ సందర్భంగా, ఒక నెలరోజులు మీకు వెసులుబాటు కలిపిస్తున్నాను.రష్యా దగ్గర కొనుక్కోండి అని నెలరోజుల స్వాతంత్ర్యాన్ని ప్రకటించినపుడూ, డూడూ బసవన్నలా ఉపేసాం. మేము ఫలానా దేశం దగ్గర కొనుక్కుం టాము. మాకు అనుమతి ఇవ్వండి అనీ ఆర్జీ పెట్టుకోవడం ఏం తెలియజేస్తున్నది! మన డబ్బులు, మన స్వతంత్ర దేశం, సార్వభౌమ దేశం, ఎవరినుంచి కొనాలన్నా ట్రంపుగారి అనుమతి పొందాలి. ఈ సందర్భాన్ని కవి ఎంత సూటిగా, ముఖం మీద కొట్టినట్టు చెప్పాడు. అయినను మనవాళ్లకు చలనం కలిగిందా, ఏమో!

రవి అస్తమించని సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించి తరిమికొట్టిన అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్, కొమురంభీమ్, ఆజాద్ చంద్రశేఖర్ లాంటి యోధానుయోధుల వీరచరితగల దేశం అమెరికా ఆజ్ఞలకు తలవంచడం, మనదేశ స్వాతంత్ర్య సార్వభౌమత్వాలను కోల్పోవడం కాదా! ప్రజలు, ప్రాంతాలు, జాతులు, మతాలు ఎన్ని రకాలుగా ఉన్నప్పటికీ, వైవిధ్యాలతో కొనసాగినప్పటికీ స్వేచ్ఛ కోసం పోరాడుతుంటే, వారికి కూడా సంఘీభావంగా నిలిచి, మద్దతు ప్రకటించిన అలీన ఉద్యమాన్ని నడిపిన, నాయకత్వం వహించిన దేశంగా పేరు పొందిన వాళ్లం మనం. ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్, అంతర్జాతీయ చట్టాలకు, న్యాయసూత్రాలకు వ్యతిరేకంగా ఇరాన్‌పై దాడులు చేస్తుంటే, ఇది సరికాదు, అని చెప్పలేకపోయాం. కనీసం మనకు ఎప్పటినుంచో స్నేహితుడు అయిన ఇరాన్ నేతను హత్యచేస్తే, ఖండించడం అటుంచి, సంతాపమూ వెంటనే ప్రకటించలేని అసహాయ, అమానవీయస్థితికి దిగజారిపోయాం.

165 మంది చిన్నపిల్లలను అతి దారుణంగా బాంబులేసి చంపేసినా చలించకపోవడం, ఖండించకపోవడం ఎంత అన్యాయం! రెండు వందల యేండ్లు సామ్రాజ్యవాదంతో పోరాడిన వారసత్వం, నేడు ప్రపంచాన్ని యుద్ధ బీభత్సంలోకి దింపిన సామ్రాజ్యవాద అమెరికాకు సాగిలపడటం ప్రభుత్వ వైఫల్యానికి, లొంగుబాటుకు నిదర్శనం. ఎందుకీ లొంగుబాటు! ఈ నాయకుల రహస్య చిట్టాలేమయినా ట్రంపు తన చేతిలో పెట్టుకుని ఉన్నాడా! ఎప్‌స్టీన్ ఫైల్స్‌లోని నిజా నిజాలు ఇంకా బయటపడాల్సి ఉంది. 'హతులెవరో తెలుసు, హంతకులెవరో తెలుసు, అయినా, అన్యాయం అని అనకపోవడమే అసలు నేరం! కదా! అపార దేశ భక్తిగల వాళ్లు మనల్ని పరిపాలిస్తున్నారని ప్రజలు భ్రమపడుతున్నారు. దేశాన్ని నిర్లజ్జగా అగ్రరాజ్య ఆజ్ఞలకు తలొగ్గడం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇంతటి వెన్నెముక లేని దేశంగా గతంలో ఎప్పుడూ లేదు. ఇప్పటికయినా ప్రజలు అప్రమత్తమయి, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిస్పందించాల్సి ఉంది. లేదంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు కోల్పోతాము.

# బాకర్ సాహెబ్ పేటలో పింఛన్ల పంపిణీ

**నవతరం- శ్రీకాకుళం**



నగరంలోని 21వ డివిజన్ బాకర్ సాహెబ్‌పేటలో బుధవారం ఉదయం ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సచివాలయ ఉద్యోగులతో కలిసి స్థానిక టీడీపీ నాయకులు 21 వ డివిజన్ బూత్ ఇంచార్జి లొట్టి సూరిబాబు నిర్వహించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సూరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా రూ.4,000, రూ.6,000, రూ.10,000 పెన్షన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండల మన్మధరావు, గొర్లి రాందేవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు..

# కొరపాం పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**నవతరం -ఆమదాలవలస**

ఆమదాలవలస మండలం కొరపాం గ్రామ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి ఆహార నాణ్యత, శుభ్రతపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేసి వారితో ముచ్చటించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు




**నవతరం -గార**

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, 6,7,8 తరగతులలో మిగిలివున్న ఖాళీల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోడానికి గడువు ఏప్రిల్ 7 వరకు పొడిగించినట్లు గార మండలం వమరవల్లి గురుకుల విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు వై. చిట్టితల్లి ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో చేరే విద్యార్థులు ఏప్రిల్ 7 లోగా ఆన్ లైన్ లో https://aprs.apcfss.in వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 24 వ తేదిన జరుగుతుందన్నారు.

# పాత్రికేయుల రక్షణకు సమగ్ర చట్టం అవసరం

**నవతరం శ్రీకాకుళం**

గోవాలో జరిగిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 144వ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాత్రికేయుల రక్షణ కోసం సమగ్ర చట్టం తీసుకురావాలని కీలక తీర్మానం ఆమోదించినట్లు ఎన్. ఈశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా పాత్రికేయులపై పెరుగుతున్న బెదిరింపులు, ఒత్తిడులు, దాడుల నేపథ్యంలో వారి భద్రతను నిర్ధారించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం అత్యవసరమని స్పష్టం చేశారు. యూఎన్ఐ కార్యాలయం సీలింగ్ వివాదంపై స్పందిస్తూ ఉద్యోగుల జీవనోపాధి కాపాడాలని కోరారు. అంతర్జాతీయంగా బంగ్లాదేశ్‌లో పాత్రికేయులపై జరుగుతున్న దాడులపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతికత, కృత్రిమ మేధ వినియోగంతో పాత్రికేయులకు శిక్షణ కల్పించడం, సంక్షేమం, ప్రోత్సాహకాలు, అవార్డులపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు.

# నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి- లేకుంటే ఉద్యమం

- శ్రీకాకుళంలో యువజన, విద్యార్థి సంఘాల ధర్నా
- జాబ్ క్యాలెండర్ విడుదల, ఖాళీల భర్తీపై డిమాండ్

**నవతరం శ్రీకాకుళం**




రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్ వద్ద యువజన విద్యార్థి సంఘాలు ధర్నా నిర్వహించాయి.
లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా తొలగించిన పింఛన్లను మళ్ళీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే రవికుమార్



**నవతరం -బూర్జ**

వైసీపీ ప్రభుత్వంలో అక్రమంగా తొలగించిన పింఛన్లును మళ్ళీ కొత్తగా మంజురా చేయించిన ఆమదాలవలస ఎమ్మెల్యే మరియు పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారికి చిరకాలం చీడివలస ప్రజలు మరియు లబ్ధిదారులు రుణపడి ఉంటామని నగరాలు అభివృద్ధి మరియు సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పిళ్ళా కన్నన్నాయుడు అన్నారు.

చీడివలస పంచాయతీలో గత 10 ఏళ్ల నుండి పింఛన్లు పొందుతున్న అర్హులైన లబ్ధిదారులను గత వైసీపీ ప్రభుత్వంలో పింఛన్లను అక్రమంగా తొలగించారు. అర్హులైనప్పటికీ వారి పైశాచిక ఆనందం కోసం ఓల్డ్ ఏజ్ పెన్షన్లు అలాగే వితంతు పెన్షన్లు కూడా తొలగించారు.

ఈ విషయాన్ని స్థానిక శాసనసభ్యులు మరియు పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ వారి వద్ద ప్రస్తావించగా ఆయన ప్రత్యేక చొరవ తీసుకొని పింఛన్లను మంజూరు చేయడం జరిగింది. ఆయన అచంచలమైన చొరవతో ఆయన కృషితో పింఛన్లు మంజూరు చేసి నేడు లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేయడం జరిగింది. ఆయన కృషికి చీడివలస పంచాయతీ నాయకులు మరియు కార్యకర్తలు మరియు లబ్ధిదారులు ప్రజలు అందరూ కూడా ఆయనకు హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

# మాజీ సైనికుల సంక్షేమమే 'వీర్ పరివార్' లక్ష్యం

**నవతరం శ్రీకాకుళం**




జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'నల్సా వీర్ పరివార్ సహాయత యోజన-2025' పథకం పనిచేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక సైనిక్ బోర్డును సందర్శించి అక్కడి పరిస్థితులపై చర్చించారు. దేశ సేవలో తరించిన మాజీ సైనికులు తమ న్యాయపరమైన చిక్కులను వదిలించుకునేందుకు ఈ పథకం ఒక చక్కని వేదిక అని ఆయన పేర్కొన్నారు.
సైనిక సంక్షేమ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లీగల్ సర్వీస్ క్లినిక్ ద్వారా ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు నిరంతరం అందుబాటులో ఉంటారని హరిబాబు వివరించారు. మాజీ సైనికులు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవడానికి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారిణి ఏ. శైలజ, ప్యానెల్ అడ్వకేట్ వి. జ్యోతిర్మయి, ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# హరిశంకర్ ఆరోగ్య విజయం
# కుటుంబం ఇచ్చిన కొత్త జీవితం



ఒక ప్రశాంతమైన కాలనీలో హరిశంకర్ అనే వ్యక్తి తన కుటుంబంతో నివసించేవాడు.
ఆయనకు భార్య లావణ్య , కుమారుడు సృజన్ , కూతురు శ్రీదివ్య .

బయటికి చూస్తే వాళ్ల జీవితం సంతోషంగా కనిపిస్తుంది...
కానీ ఒక సమస్య మాత్రం ఆ కుటుంబాన్ని నెమ్మదిగా ఇబ్బంది పెడుతోంది.

హరిశంకర్ షుగర్ (మధుమేహం) తో బాధపడుతున్నాడు.

మొదట్లో ఆయన దాన్ని పెద్దగా పట్టించుకోలేదు.
“ఏమీ కాదు... కొంచెం జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది” అనుకునేవాడు.
కానీ రోజులు గడిచేకొద్దీ ఆయన ఆరోగ్యం క్షీణించసాగింది.

ఒక రోజు ఆయనకు తల తిరగడం, అలసట ఎక్కువైంది.
అది చూసిన లావణ్య ఆందోళనతో చెప్పింది:
“ఇలా వదిలేస్తే కుదరదు... మనం డాక్టర్ దగ్గరకు వెళ్దాం.”

అందరూ కలిసి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ దగ్గరకు వెళ్లారు.

డాక్టర్ శాంతంగా మాట్లాడాడు:
“హరిశంకర్‌గారూ... షుగర్ వ్యాధి మాత్రమే కాదు...
అది జీవన విధానాన్ని మార్చే ఒక హెచ్చరిక.”

ఆయన కుటుంబాన్ని చూస్తూ ఇలా చెప్పాడు:

“మీ అందరూ కలిసి జాగ్రత్తలు తీసుకుంటే...
ఇది పూర్తిగా నియంత్రణలో ఉంటుంది.”

డాక్టర్ ముఖ్య సూచనలు:
1. ఆహారం నియంత్రణ
తక్కువ చక్కెర, తక్కువ నూనె
ఎక్కువ కూరగాయలు, ఫైబర్ ఉన్న ఆహారం
సమయానికి భోజనం

2. ప్రతిరోజూ వ్యాయామం
కనీసం 30 నిమిషాలు నడక
యోగా లేదా ఆనంద వ్యాయామం

3. సాధారణ చెకప్
షుగర్ లెవెల్స్‌ను తరచుగా పరీక్షించుకోవాలి

4. ఒత్తిడి తగ్గించుకోవడం
ప్రశాంతంగా ఉండాలి
కుటుంబంతో సమయం గడపాలి

5. మందులు సమయానికి తీసుకోవడం

సృజన్ వెంటనే అన్నాడు:
“నాన్నా... నేను మీతో ప్రతిరోజూ వాకింగ్‌కి వస్తాను!”

శ్రీదివ్య కూడా నవ్వుతూ చెప్పింది:
“మనం అందరం ఒకేలా హెల్తీ ఫుడ్ తింటాం!”

లావణ్య ప్రేమగా చూసి చెప్పింది:
“ఇది మీ పోరాటం కాదు... మనందరి బాధ్యత.”

ఆ రోజు నుంచి ఆ కుటుంబం మారిపోయింది.

హరిశంకర్ ఒంటరిగా కాకుండా...
కుటుంబం మొత్తం కలిసి ఆయన ఆరోగ్యాన్ని కాపాడింది.

కొన్ని నెలల తర్వాత...

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ నవ్వుతూ అన్నాడు:
“చూడండి... జాగ్రత్తలు తీసుకుంటే షుగర్ కూడా మనకే వింటుంది!”

హరిశంకర్ కళ్లలో ఆనందం కనిపించింది.
ఆయనకు ఒక విషయం అర్థమైంది

వ్యాధి కంటే... కుటుంబం ఇచ్చే సహాయం గొప్పది.
ముగింపు సందేశం (నైతిక):

షుగర్ అనేది భయం కాదు...
జాగ్రత్తలు తీసుకుంటే నియంత్రించగలిగే పరిస్థితి.
కుటుంబం తోడుంటే...
ఏ వ్యాధినైనా జయించవచ్చు.

రచన: తేరాల రాజేంద్ర ప్రసాద్ గుప్తా
మీసేవ - బి .జె. ఆర్ నగర్
హైదరాబాద్ - 37

# ఈ విద్యా సంవత్సరం నుంచే
# డిగ్రీ తరగతులు ప్రారంభం

- కోటబొమ్మాళిలో తాత్కాలికంగా జూనియర్ కాలేజీలోనే క్లాసులు
- విద్యార్థుల దూరాభారం తగ్గేలా చర్యలు: మంత్రి అచ్చెన్నాయుడు



**నవతరం-కోటబొమ్మాళి**

కోటబొమ్మాళిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఈ నిర్ణయం తీసుకున్నారు. స్థిర భవనాలు సిద్ధమయ్యేలోపు జూనియర్ కళాశాల భవనంలో తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలని సూచించారు. నాలుగు కోర్సులతో 160 సీట్లను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఈ నిర్ణయంతో కోటబొమ్మాళి పరిసర విద్యార్థులకు టెక్కలి, పలాస, శ్రీకాకుళం వెళ్లే దూరాభారం తగ్గనుందని తెలిపారు.

# టెక్కలి ప్రజల పాపమా- అది వారి శాపమా

పట్టణ, పరిసర ప్రాంత ప్రజల నిరాశలు

**నవతరం టెక్కలి**



టెక్కలి మండల పట్టణ మరియు పరిసర ప్రాంత వాసులు నిరాశ నిస్పృహలకు లోనై ఉన్నారని అది వాస్తవిక సత్యమని కొంతమంది మేధావులు యొక్క భావన అభివృద్ధి ఒక ప్రక్క అయితే నిరాశ కూడా ఒక ప్రక్క చోటు చేసుకున్నది. ఇటీవల కాలంలో నౌపడ రైల్వే జంక్షన్ నుండి టెక్కలి మీదుగా పోయే రూర్కెలా నుండి రాయగడ రాజా రాణి ఎక్స్ప్రెస్ రైలును పాతపట్నం రైల్వే స్టేషన్ లో హాల్ హాల్ట్ ఇవ్వడం జరిగింది అక్కడే టెక్కలి ప్రజలకు అసలైన నిరాశ చెప్పలేనంత నిస్పృహ మొదలైంది. అత్యంత అవసరమైన టెక్కలి ప్రాంతవాసులకు టెక్కలి రైల్వే స్టేషన్ లో రైలు హాల్ట్ లేకపోవడం చాలా బాధగా ఉన్నదని ప్రజలు వాపోవుచున్నారు. దీనికి కారణం టెక్కలి మండల పరిధిలో 27 పంచాయితీ లు ఉన్నాయి. వాటికి అనుసంధానముగా ఎంతో వ్యవసాయ వ్యాపార విద్య అభివృద్ధి చెందిన గ్రామాలు ఉన్నాయి ఆయా గ్రామాలలో అభివృద్ధి చెంది చైతన్యవంతులైన ప్రజలు ఉన్నారు. వారంతా అతి సమీపంలో ఉన్న పక్క ఒరిస్సా రాష్ట్రంలో అనేకమైన ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో వివిధ వ్యాపార రంగాలలో ఉండే దైనందిన జీవితాన్ని సాగిస్తూ రాకపోకలకు కనీస సౌకర్యాలు లేనందున ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు.
అలాగే టెక్కలి పట్టణ పరిధిలో అతిపెద్ద సంఖ్యలో ఒరియా కుటుంబాలు జీవిస్తూ ఉన్నారు. వారు కూడా కుటుంబ సంబంధ బాంధవ్యాలతో ప్రక్క ఒరిస్సా రాష్ట్రంలోఉన్న వారి తో సంబంధాలు నెలకొని ఉన్నారు. ఈ టెక్కలి రైల్వే స్టేషన్ నుండి ప్రతిరోజు కొన్ని వందల మంది రాకపోకలు చేస్తూ ఉన్నారని కాబట్టి నౌపడ రైల్వే జంక్షన్ నుండి టెక్కలి మీదుగా వచ్చే ,పోయే అన్ని రైలులు తప్పనిసరిగా హాల్ట్ ఇవ్వాలని వాపోతున్నారు. ఎంతటి చక్కని అవకాశం ఉన్న టెక్కలి రైల్వే స్టేషన్ను ఆధునికరించి అభివృద్ధి చేయవలసిన గురుతర బాధ్యతలు రైల్వే బోర్డు అధికారులకు మరియు ఎంతో అభివృద్ధి పదంలో నడుపుతున్న ప్రస్తుత ఉన్నత పదవులలో ఉన్న ప్రజా నాయకులకు వారి యొక్క ప్రజలు వీరాభిమానులు తమ యొక్కను దీర్ఘ ఆలోచనల నుండి విముక్తి చేస్తూ తక్షణ చర్యలు చేపట్టి వారి పాప, శాపాల నుండి అభివృద్ధి పదంలో ముందుకు సాగాలని ప్రజల యొక్క భావన.

# ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో తీవ్రంగా పడిపోయిన ప్రాథమిక సదుపాయాలు

**నవతరం - ఇచ్ఛాపురం**



ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో తీవ్రంగా పడిపోయిన ప్రాథమిక సదుపాయాల నేపథ్యంలో, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘసేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ రమేష్ గారికి జాయింట్ పిటిషన్ ఇచ్చారు. తాగునీటి కొరత, దుర్భర రోడ్లు, పని చేయని డ్రైనేజీలు, ట్యాంకర్ నీటి పంపిణీలో ప్రమాదకర పరిస్థితులు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు అధికారులు డిమాండ్ చేశారు.
కమిషనర్ సానుకూల స్పందన
వినతిపత్రాన్ని స్వీకరించిన కమిషనర్ గారు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి“వారం రోజుల్లో ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తాం” అని హామీ ఇచ్చారు. దీనితో స్థానిక ప్రజల్లో స్వల్ప నమ్మకం, ఆశలు చిగురించాయి.
పిటిషన్‌లో ప్రస్తావించిన ప్రధాన సమస్యలు
తాగునీటి కొరత జల్ జీవన్ మిషన్ ఆలస్యం
జల్ జీవన్ మిషన్ అమలు ఆలస్యమవడం వల్ల అనేక వార్డుల్లో ఇప్పటికీ తాగునీటి సరఫరా అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గృహిణులు, వృద్ధులు, చిన్నారులు అత్యంతగా ప్రభావితమవుతున్నారు.
రోడ్ల దుర్భర స్థితి వర్షాలు, అటు నిర్వహణ లోపం కారణంగా రోడ్లు గుంతలతో నిండిపోయి ప్రయాణాలు కష్టసాధ్యమయ్యాయి. రవాణా అంతరాయం, ప్రమాదాలు పెరిగే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ వ్యవస్థ లోపాలు
అనేక ప్రాంతాల్లో డ్రైనేజీలు మూసుకుపోయి చెత్తతో నిండిపోయాయి. దుర్వాసన, దోమల పెరుగుదల, వ్యాధుల ప్రబలింపు వంటి అంశాలను సంఘం బాధ్యతాయుతంగా చర్చించింది. ట్యాంకర్ నీటి పంపిణీ ప్రమాదాలు
కల్వర్టుపై రక్షణ కవర్లు లేకపోవడంతో ట్యాంకర్లు రోడ్డుపైనే నిలిపి నీరు సరఫరా చేయాల్సి వస్తోంది. దీతో మహిళలు, పిల్లలకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.
రాజ్యాంగ -- మానవహక్కుల ఉల్లంఘనలు
తాగునీరు, పరిశుభ్రత, భద్రత, ఆరోగ్యకర జీవన వాతావరణం వంటి అంశాలు అందకపోవడం ఆర్టికల్ 21 సహా రాజ్యాంగపరమైన హక్కుల ఉల్లంఘనగా అభివర్ణించారు. సంఘం ప్రధాన డిమాండ్ ఇచ్ఛాపురం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 50 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం బలంగా డిమాండ్ చేసింది.

# కార్మిక సమస్యలు పరిష్కరించాలి

- హిరమండలం కార్మిక శాఖపై సిఐటియు ఆగ్రహం
- పరిష్కారం లేకుంటే ఆందోళన హెచ్చరిక

**నవతరం-పాతపట్నం**



పాతపట్నం నియోజకవర్గం హిరమండలం కార్మిక శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పనస రమేష్ విమర్శించారు. కొత్తూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు గుర్తింపు కార్డులు, క్లెయిమ్ నమోదు వంటి సేవల కోసం నెలల తరబడి తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని అన్నారు. జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.
లేకుంటే హిరమండలం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# పేదల కోసం పనిచేసే ప్రభుత్వం: గొండు జగపతి

- తండేంవలసలో పింఛన్ పంపిణీ కార్యక్రమం
- చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమం-అభివృద్ధి: ప్రశంసలు

**నవతరం శ్రీకాకుళం**



శ్రీకాకుళం రూరల్ మండలం తండేంవలసలో బుధవారం నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొండు జగపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం ప్రతి నెలా సమయానికి పింఛన్లు అందజేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుండగా, ఎమ్మెల్యే గొండు శంకర్ కృషితో స్థానికంగా అభివృద్ధి వేగవంతమైందని తెలిపారు.
పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జనహితమే యూజేఎఫ్ అభిమతం



**హ్యాండ్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమంలో యూజే ఎఫ్ అధ్యక్షులు డా.ఎం.ఆర్.ఎన్ వర్మ**

**నవతరం-విశాఖపట్నం**

జనహితమే లక్ష్యంగా నిర్వహించే శబల భోజనాల పండగలాంటి కార్యక్రమాలకు జర్నలిస్టుల సమూహంగా ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ (యూజేఎఫ్) తమ వంతు సహకారాన్ని అందిస్తుందని యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్. వర్మ అన్నారు. సింహాచలం గోశాల లో బుధవారం ఉదయం ప్రారంభమైన శబల భోజనాల పండుగ కార్యక్రమంలో యూజే ఎఫ్ హ్యాండ్ బుక్ 2026-27 ను విజయనగరం శాసనసభ్యులు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు , నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, వి ఎం ఆర్ డి ఏ మెట్రోపాలిటిన్ కమిషనర్ తేజ్ భరత్, సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, సింహాచలం దేవస్థానం ఈవో జె.వెంకటరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూజేఎఫ్ అధ్యక్షులు డా. ఎం. ఆర్. ఎన్ వర్మ మాట్లాడుతూ సమాజ హితం కోరి నిర్వహించే శబల భోజనాలు పండుగ లాంటి కార్యక్రమాలకు ప్రచారం కల్పించడంలో యూజేఎఫ్ తనవంతుగా కృషి చేస్తోందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం జర్నలిస్టులుగా సామాజిక బాధ్యతతో పనిచేస్తున్న సంఘం యూజేఎఫ్ అని వివరించారు. కార్యక్రమంలో వక్తలు ప్రసంగిస్తూ యూజేఎఫ్ సేవలను కొనియాడారు. యూజే ఎఫ్ హ్యాండ్ బుక్ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూజేఎఫ్ విశాఖపట్నం శాఖ అధ్యక్షులు, ఏపీయూడబ్ల్యూజే విశాఖ జిల్లా అధ్యక్షులు కే రాము,సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, మిల్లెట్స్ రాంబాబు, గ్రీన్ క్లైమేట్ జే. వి.రత్నం,యూజేఎఫ్ సమన్వయ కర్త డి. ఎస్. ఎస్. ఎస్. కే.హరనాథ్, సీనియర్ జర్నలిస్టులు యూ.వి.బి.భాస్కర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు కోయిలాడ పరుశురాం, పి. సత్యనారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

# శబల ఆహారమే ఆరోగ్యకరం



**- ప్రకృతి ఆధారంగా పండించిన పంటలే ఆరోగ్యకరం**
**- రసాయనాలతో భూమిని సర్వనాశనం చేయవద్దు**
**- అతిథి, శాసనసభ్యులు, విజయనగరం**

**నవతరం-విశాఖపట్నం**

శబల ఆహారమే ఆరోగ్యకరం అని విజయనగరం శాసనసభ్యులు అతిథి వివరించారు. బుధవారం ఉదయం సింహాచలం గోశాల లో సేవ్ సంస్థ నిర్వహించిన శబల భోజనాలు పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. ప్రకృతి ఆధారంగా పండించిన పంటలే ఆరోగ్యకరం, ఆనందదాయకం అని వివరించారు. రసాయనాలతో భూమిని సర్వనాశనం చేయవద్దు అని పిలుపునిచ్చారు. అలాగే మన గాలి, నీరు, ఆహారం ఆరోగ్యకరమైనవిగా ఉండాలని అన్నారు. వీఎం ఆర్ డి ఎ మెట్రో పొలిటిన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ శబల భోజనాలు పండుగ కు రావటం తన అదృష్టమని భావిస్తున్నానన్నారు. ఈ విధమైన ఆహారం భుజించడం, ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. రైతులు అందరూ ఈ విధంగా పంటలు పండించడం అలవర్చుకోవాలి అని కోరారు. పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రకృతి కోసం పని చేయడం చాలా గొప్ప విషయం అని వివరించారు. వేలాది మంది ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు అత్యధిక సంఖ్యలో కలిసి నిర్వహిస్తున్న ఈ పండుగ వెయ్యేళ్ల క్రితం ఏ విధంగా పంటలు పండించి ఆరోగ్యకరంగా అందురూ కలిసి మెలిసి జీవించే వారో ఆ విధంగా ఈ రోజు ఇక్కడ ఒక ఆనందదాయకం అయిన పరిస్థితి ఉంది అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు అధికం గా నిర్వహించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఇఓ జె వెంకటరావు, సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, మిల్లెట్స్ రాంబాబు, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, ప్రకృతి రైతులు శ్రీనాథ్ , విశ్రాంత ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా ఈ పండుగ లో మహేష్ అనే రైతు కాంక్రీజ్, థార్ పార్కర్, పుంగనూరు, సాహీవాలీ, రాఠీ సంతతి కి చెందిన ఆవులు ప్రదర్శించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ, పిఠాపురం నుంచి వచ్చిన బాలు, ధాన్యం కంకులతో కుచ్చులు తయారీ శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే తాటాకు చాపలు అల్లడం, మట్టి తో కుండలు ఊనడం, వెదురు బుట్టలు అల్లడం, కొబ్బరి ఆకులతో బొమ్మలు తయారు చేయడం, తాటాకు మట్ట తో మంచం నేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్టు ఫ్రంట్ అధ్యక్షులు వర్మ నేతృత్వంలో డైరీ ఆవిష్కరణ చేశారు.

# ఎమ్మెల్యే చొరవతో శ్రీకాకుళం పట్టణానికి మహర్ధశ

**టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పి ఎం జె బాబు**



**నవతరం- శ్రీకాకుళం**

స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్ ఆదేశాలు మేరకు ఈ రోజు ఆదివారంపేట సచివాలయం పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. కొత్తగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకున్న పొదిలాపు ఆదిలక్ష్మి ముఖ్యమంత్రి చంద్రబాబు కు తమ కుటుంబం రుణపడి ఉంటుందని సంతోషం వ్యక్తం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతీ నెల ఒకటో తేదీన పింఛన్లు లబ్ధిదారుల ఇంటివద్ద పంపిణీ చేస్తుండం అందరూ గర్వపడుతున్నారు. ఈ సందర్భంగా పి ఎం జె బాబు మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు, నాలుగు వేలు, విభిన్న ప్రతిభావంతులకు ఆరు వేలు, దీర్ఘకాలిక రోగులకు పది వేలు చొప్పున పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. సూపర్ సిక్స్ అమలు సూపర్ హిట్ అవ్వడం ప్రజల అదృష్టం. కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్రప్రదేశ్ దిశగా పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి మార్గదర్శంగా నిలిచారు. నగరంలో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగతుండడం పట్ల జనం హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారు. పెదపాడు రోడ్డు విస్తరణ పనులు పూర్తి అయి సెంటర్ లైటింగ్ కూడా ప్రారంభించారు. కొత్తరోడ్డు అంబేద్కర్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అరసవిల్లి ఇంద్ర పుష్కరణి ఆదునీకరణ పనులకు ఇటీవల కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే శంకుస్థాపన చేసారు. కోడి రామ్మూర్తి స్టేడియం పనులు పూర్తికి నిధులు ఎమ్మెల్యే రప్పించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు కింజరాపు అచ్చన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ సమిష్టి కృషితో శ్రీకాకుళం పట్టణానికి మహర్ధశ పట్టనుంది అని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో రెండో డివిజన్ ఇంచార్జి రాజారావు, రెడ్డి శివ, జగన్, నాగు సచివాలయం సిబ్బంది జ్ఞానేష్ వనిత, వినీల, భారతి, శివాజీ, ధనలక్ష్మి హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు దిశానిర్దేశం -శిక్షణ సక్సెస్

**- రెండు రోజులపాటు జరిగిన తరగతులు విజయవంతం**
**- నరసన్నపేటలో భారీగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు**



**నవతరం- శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026 కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.
నియోజకవర్గ కన్వీనర్ శ్రీ పోకతోట సింహాచలం, జీఎస్ శ్రీ చింతు పాపారావు ఆధ్వర్యంలో మార్చి 31 మరియు ఏప్రిల్ 1 తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తల కోసం నరసన్నపేటలోని సౌభాగ్య లక్ష్మి కళ్యాణమండపంలో ఈ కార్యక్రమం జరిగింది.
శిక్షణలో పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత బలోపేతం, ప్రజలతో అనుసంధానం, కార్యాచరణ విధానాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలకు కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు.
ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# గేట్ పరీక్షలో ఐతం విద్యార్థుల ప్రతిభ

**36 మంది అర్హత ఉత్తమ ర్యాంకులు, 863, 1528. కళాశాల డైరెక్టర్ వివరణ**




**నవతరం టెక్కలి**

ఐతం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 2026లో నిర్వహించిన గేట్ పరీక్షల్లోతమ ప్రతిభను కనబర్చారు. వివిధ బ్రాంచ్‌లకు చెందిన మొత్తం 36 మంది విద్యార్థులు అర్హత సాధించగా, 863 మరియు 1528 వంటి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరావు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడవ సంవత్సరం చదువుతున్న 6 మంది విద్యార్థులు, చివరి సంవత్సరం చదువుతున్న 30 మంది విద్యార్థులు కలిపి మొత్తం 36 మంది ఈ పరీక్షలో ప్రతిభ కనబర్చడం మన కళాశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల మార్గదర్శకత్వం, కళాశాలలో అందిస్తున్న ప్రత్యేక శిక్షణ వల్ల ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, అల్యూమ్ని కోఆర్డినేటర్ డా. డి. యుగంధర్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు అభినందించారు.

# లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**- ఎచ్చెర్లలో సిఐటియు నిరసన**
**- కార్మిక హక్కుల పరిరక్షణ కోరుతూ ఆందోళన**




**నవతరం-ఎచ్చెర్ల**

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సి.హెచ్. అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఎచ్చెర్ల మండలంలోని నాగార్జున అగ్రికమ్ పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. కార్మిక చట్టాలను కోడ్స్‌గా మార్చడం అప్రజాస్వామికమని, కార్మిక హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ రద్దు వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**